క్లుప్తంగా

రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి ఒక్కరికీ అందించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

నూతనకల్ : భారత రాజ్యాంగ గ్రంథాన్ని దేశంలోని ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని కోరుతూ డీఎస్పీ ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్ శ్రీధర్ నాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు మహారాజ్ మాట్లాడారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఇచ్చిన పిలుపు మేరకు వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు రాజ్యాంగ గ్రంథాన్ని అందించినట్లయితే వారి విధులు, బాధ్యతలు, హక్కులను తెలుసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మండల నాయకులు శ్రీహరి మహారాజ్, సైదులు మహారాజ్, సురేష్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

భానుపురి : పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం అంగన్వాడీ సూపర్‌వైజర్ అన్నపూర్ణ చిన్నారులకు అభివృద్ధి నివేదిక కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పందిరి జ్యోతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రవాణా చార్జీలు చెల్లించాలి

పెన్‌పహాడ్ : దూర ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు అదనపు కూలి లేదా రవాణా చార్జీలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో పని చేస్తున్న ఉపాధి హామీ కార్మికుల పని ప్రదేశాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీరుగార్చేందుకు కుట్రలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దెల బాలస్వామి, జనార్దన్, దొంగరి బజారయ్య, బాలయ్య, విజయ్, మేకల సుధాకర్, అంజమ్మ, గుంజ సుమీల తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ యూత్ అధ్యక్షుడిగా మధూకర్



నియామకపత్రం అందజేస్తున్న ప్రవీణ్

అర్వపల్లి : మాదిగ జేఏసీ యూత్ మండల అధ్యక్షుడిగా కోడూరు గ్రామానికి చెందిన గంట మధూకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మాదిగ జేఏసీ యూత్ నియోజకవర్గ అధ్యక్షుడు పేరాల ప్రవీణ్ గురువారం మధూకర్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మధూకర్ మాట్లాడారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో యూత్ నూతన గ్రామ కమిటీలు వేయనున్నట్లు చెప్పారు. తన ఎన్నికకు సహకరించిన మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి రవి, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మృతి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, గ్రామ పంచాయతీ కో ఆప్షన్ మెంబర్ కొండమీది గోపయ్య (87) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని ఎంపీపీ నెమ్మాది భిక్షం, పీఏసీఎస్ చైర్మన్‌లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, అనంతుల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు గుర్రం అమృతారెడ్డి, మడ్డి అంజిబాబు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



గోపయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

ధాన్యం రాశులపై దొంగల కన్ను

- జాజిరెడ్డిగూడెం మండలంలో ఇప్పటి వరకు 180 బస్తాల చోరీ
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

అర్వపల్లి : అన్నదాతలు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన పంటలపై ఓ పక్క ప్రకృతి కన్నెర్ర జేస్తుండగా.. మరో వైపు దొంగలు వెంటాడుతున్నారు. ఇప్పటికే అకాల, వడగళ్ల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలకు పోను చేతికొచ్చిన కొద్దిపాటి ధాన్యాన్ని రైతులు అమ్మడానికి కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రాశులు పోసి ఉంచగా దొంగల కన్ను ఈ ధాన్యంపై పడింది. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా 21 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. అయితే పది రోజులుగా దొంగలు ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని చోరీ చేస్తున్నారు.



తిమ్మాపురంలోని పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం చోరీ అయిన రాశి వద్ద కౌలు రైతు హుస్సేన్

కొనుగోలు కేంద్రాల్లో చోరీలు..

జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కౌలు రైతు బానోతు హుస్సేన్ ఇటీవల 300 బస్తాల ధాన్యాన్ని అమ్మడానికి తెచ్చిపోయగా గురువారం అర్ధరాత్రి దాటాక సుమారు 100 బస్తాల ధాన్యాన్ని రాశిలోంచి దొంగలు చోరీ చేశారు. అలాగే తాజాగా రెండు రోజుల కిందట ఉయ్యాలవాడ గ్రామంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో గ్రామ రైతు గోంద్ర సైదులు ధాన్యాన్ని అమ్మడానికి తెచ్చి పోయగా తెచ్చిన ధాన్యంలో 80 బస్తాల ధాన్యాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇలా రోజుకో గ్రామంలో దొంగలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని చోరీ చేస్తున్నారు. ఇంకా మరికొందరి రైతుల ధాన్యం కూడా వారు పోసినప్పుడు.. ఇప్పుడు ఉన్న ధాన్యంలో తేడా వస్తుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. పోలీసులు తగిన విచారణ చేసి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రూ. 80వేల నష్టం వాటిల్లింది

నేను 10 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఇందులో సగం పంట అకాల వర్షాలతో నేలపాలైంది. అదిపోను 300 బస్తాల ధాన్యం రాగా అమ్మడానికి గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాను. అక్కడ వంద బస్తాల ధాన్యం చోరీ జరిగింది. చోరీ అయిన ధాన్యం రూ. 80వేల విలువ చేస్తుంది.

\- బానోతు హుస్సేన్, కౌలురైతు, తిమ్మాపురం

80 బస్తాల ధాన్యాన్ని చోరీ చేశారు

నేను ఉయ్యాలవాడలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్మడానికి తెచ్చిపోయగా అందులో 80 బస్తాల ధాన్యాన్ని దొంగలు చోరీ చేశారు. ఈ విషయమై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాను. నాకు న్యాయం చేయాలి.

\- గోంద్ర సైదులు, రైతు, ఉయ్యాలవాడ

ఐకమత్యంతో పండుగలు జరుపుకోవాలి



చివ్వెంల : బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



చివ్వెంల : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి, తదితరులు

చివ్వెంల : గ్రామాల్లో ప్రజలు పండుగలను ఐకమత్యంగా జరుపుకోవాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాజుతండాలో నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ధరావతు కుమారి బాబునాయక్, జెడ్పీటీసీ సభ్యుడు భుక్యా సంజీవ్ నాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి..

మండల పరిధిలోని రాజుతండాలో జరుగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎల్కా నర్సిరెడ్డి, షఫీఉల్లా, ధరావతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అర్వపల్లి : అకాల వర్షాల వల్ల మండల వ్యాప్తంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రత్నం సంతోష్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యం చోరీకి గురవుతున్నందున సంబంధిత అధికారులు తగు రక్షణచర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్‌పార్టీ పోరాడుతుందని పేర్కొన్నారు.

ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం

భానుపురి : పట్టణంలోని తహసీల్దార్ రోడ్‌లో ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రెండవ రోజు వేద పండితులు ఫణి కుమారాచార్యులు ఆధ్వర్యంలో సుందరహోమం నిర్వహించారు. శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అష్టోత్తర శతఘటాభిషేకం (108 కలశములు)తో పాటు అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరకాండ, విష్ణు సహస్రనామ, భగవద్గీత, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలను సూర్యాపేట భక్తబృందంతో జరిపించారు. అనంతరం దేవాలయ ప్రధానార్చకుడు దరూరి రామానుజచార్యులు మాట్లాడారు. ఈ నెల 12న లక్ష నాగవల్లి దళార్చన, 13న లక్ష మల్లెల పుష్పార్చన, 14న ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా 108 పర్యాయాలు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం వ్యవస్థాపక ఫ్యామిలీ మెంబర్ కొత్త ఆంజనేయులు, కార్యనిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు దరూరి శ్రీధరాచార్యులు, దరూరి శ్రీనాథ చార్యులు, దరూరి భాను కుమార్, దేవాలయ జూనియర్ అసిస్టెంట్ కీసర దేవేంద్ర చార్యులు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్, బోనగిరి వెంకటేశ్వర్లు, వాసా నాగేశ్వర రావు, దంతాల కొండల నాయుడు, పురం నాగ రాజు, పబ్బా రజని, కే.నారాయణ రావు, కొత్త శ్రీనివాస్, నాగరాజు, చిత్తలూరు శ్రీధర్, మంచాల రంగయ్య, పబ్బా రామమూర్తి పాల్గొన్నారు.



భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం



సూర్యాపేట రూరల్ : మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండల స్థాయిలో సీఎం కప్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అధికారులకు సూచించారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ టోర్నమెంట్ కప్ క్రీడల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో క్రీడలు నిర్వహించాలని, క్రీడాకారులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఏఈఓ శైలజ, బీఆర్ఎస్ నాయకులు గొర్ల గన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల స్థాయిలో నిర్వహించే సీఎం కేసీఆర్ కప్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ టోర్నమెంట్ కప్ క్రీడల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో క్రీడలు నిర్వహించాలని, క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల ఆవరణలో నిర్వహించే క్రీడా పోటీల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, పీఏసీఎస్ చైర్మన్‌లు నాతాల జానకిరాంరెడ్డి, వెన్న సీతారాంరెడ్డి, ఏపీఓ రవి, సర్పంచ్ చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, కొండా జానకిరాములు, రవి, పీఈటీలు శ్రీనివాస్, జానకి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వర్ణలత

15నుంచి సీఎం కప్ క్రీడలు

ఆత్మకూర్ (ఎస్) : సీఎం కప్ క్రీడలను మండలవ్యాప్తంగా ఉత్సాహంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీపీ మర్ల స్వర్ణలత చంద్రారెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం కప్ క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 17 వరకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను మండల స్థాయిలో ఎంపిక చేస్తారని, మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయిలో క్రీడలు ఆడాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప, ఎంపీడీఓ మల్సూర్ నాయక్, ఎంఈఓ ధారాసింగ్, హెడ్ కానిస్టేబుల్ దానియల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



అర్వపల్లి : వేల్పుచర్లలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మన్నె రేణుక



పెన్‌పహాడ్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

అర్వపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. గురువారం వేల్పుచర్లలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండి కంటి సమస్యలున్న ప్రతి ఒక్కరూ ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకొని మందులు, అద్దాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఖమ్మంపాటి కరుణాకర్, ఎంపీటీసీ బొడ్డు భద్రమ్మరామలింగయ్య, ఉపసర్పంచ్ ఎం. రాంబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖమ్మంపాటి నరేష్, కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్‌ఓ ఎల్. చరణ్, ఆప్తమాలజిస్ట్ ఎ. వేణు, అంగన్‌వాడీ టీచర్ కె. ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎ. రవీందర్‌రెడ్డి, ఏఎన్ఎం ఊర్మిళ, ఎస్. జ్ఞానసుందరి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పేదలకు వరం

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలందరికీ కంటి వెలుగు వరం లాంటిదని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. గురువారం మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కంటి సంబంధిత సమస్యలను పరిష్కరించడం కోసమే సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ కంటి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఊరుకొండ జానకమ్మ, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు రఫీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, కొండా జానకిరాములు, ఒగ్గు గోపి, రవి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలతో కూలీలకు ఉపాధి



మహ్మదాపురం నర్సరీలో పని చేస్తున్న కూలీలు

- హరితహారానికి సిద్ధమవుతున్న మొక్కలు

పెన్‌పహాడ్ : గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచేందుకు ఏర్పాటు చేసిన నర్సరీలతో రెండు రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమానికి కావాల్సిన మొక్కల కోసం ప్రతి పంచాయతీకి ఒక్కటి చొప్పున నర్సరీలు ఏర్పాటు చేశారు. ఈ నర్సరీల ద్వారా హరితహారానికి మొక్కలు సిద్ధమవుతుండగా, కూలీలకు ఉపాధి సైతం దొరుకుతోంది. నర్సరీలతో ఆయా గ్రామాల్లోని కూలీలకు ఉపాధి లభిస్తుండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నర్సరీల్లో రోజుకు కనీసం 5 నుంచి 10మంది కూలీలు పని చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో ప్లాస్టిక్ బ్యాగుల్లో మట్టి నింపడం, మట్టికి ఎరువులు కలిపి మొక్కలు నాటేందుకు బెడ్లు సిద్ధం చేయడం, విత్తనాలు నాటడం, నీళ్ల పట్టడం వంటి పనులతో పాటు ప్రస్తుతం నర్సరీ నిర్వహణ, మొక్కలకు నీళ్లు అందించడం వంటి పనుల కోసం ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నారు. నర్సరీల్లో ప్రజలకు పంపిణీ చేసేందుకు అవసరమైన మొక్కలతో పాటు రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో నాటేందుకు అవసరమైన మొక్కలను పెంచుతున్నారు.

ప్రతి పంచాయతీకి 10వేలు టార్గెట్..

హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ప్రతి పంచాయతీలో 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వం ఆదేశించింది. పెన్‌పహాడ్ మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా 29 నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీలో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల ద్వారా సమకూర్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నర్సరీల్లో పనులపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎరువులు, ఎర్రమట్టితో ప్రత్యేకంగా బెడ్లను సిద్ధంగా చేసి మొక్కలు పెంచుతున్నారు. ప్రధానంగా ప్రజలకు పంపిణీ చేసేందుకు ఇళ్లల్లో నాటేందుకు అనువైన జామ, సీతాఫలం, దానిమ్మ, చింత, నిమ్మ, కరివేపాకు, గోరింటాకు వంటి మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించారు. తరువాత ప్రాధాన్యం క్రమంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌కు, గ్రామ అవసరాలకు అనుకూలమైన టేకు, అల్లనేరేడు, రావి, మర్రి, గుల్‌మోరా వంటి మొక్కలను హరితహారం కోసం సిద్ధం చేస్తున్నారు.

కూలీలకు పని కల్పిస్తున్నాం



పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల ద్వారా రెండు రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. హరితహారం ద్వారా గ్రామాల్లో నాటేందుకు అవసరమైన మొక్కలు సిద్ధమవుతుండగా, కూలీలకు పని సైతం దొరుకుతోంది. ప్రతిరోజు మొక్కలకు నీళ్లు పట్టడం, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటడం వంటి పనులను ఉపాధి హామీ కూలీలతో చేయిస్తున్నాం.

\- రవి ఏపీఓ

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన నాగెల్లి సందీప్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో గురువారం మృతుడి కుటుంబాన్ని పీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ వేర్వేరుగా పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనియాకుల కోటమ్మసత్యనారాయణ, నకిరేకంటి భార్గవ్, దొంతగాని సైదులు, బాలమల్లు సైదులు, రామినేని అప్పారావు, సర్వయ్య, నాగయ్య, బుజ్జమ్మ, నకిరేకంటి వెంకన్న, కృష్ణయ్య, అంతయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : నాగారం మండలం పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన గుండు నరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా గురువారం వర్ధమానుకోట ఎంపీటీసీ -2 వడ్డే పరశురాములు మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10,000ల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యారాల రాంరెడ్డి, ఉపసర్పంచ్ ఈదుల కిరణ్, నాయకులు బండగోర్ల ఎల్లయ్య, ఈదుల అరుణ్, గుండు శీను, యాదగిరి, రామ్మూర్తి, జలంధర్, నర్సయ్య, లింగమల్లు, మల్లయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి మంత్రి, ఎమ్మెల్యేల నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

నాగారం : మండలం పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్ఓ, సీనియర్ రాజకీయ నాయకుడు పాటి లక్ష్మీనరసింహారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ గురువారం మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డెయిరీ డెవలప్మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మన్ సోమ భరత్ కుమార్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యారాల రాంరెడ్డి, గుండగాని అంబయ్య గౌడ్, బోయిని శోభ లింగమల్లు, ఈరేటి అంజయ్య, ఈదుల కిరణ్, వడ్డే పరశురాములు, కూరం వెంకన్న, బండగోర్ల ఎల్లయ్య, వేముల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేపీఎస్‌ల సమ్మెకు పిట్ట రాంరెడ్డి మద్దతు

దురాజ్‌పల్లి : పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సూర్యాపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ పిట్ట రాంరెడ్డి మద్దతు తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఎదుట జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వివిధ కారణాలతో చనిపోయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు.



జేపీఎస్‌ల నిరసనలో పాల్గొన్న పిట్ట రాంరెడ్డి

వెంపటి అంగన్వాడీకి ఎస్‌బీఐ చేయూత

తుంగతుర్తి : చిన్నపిల్లలు ఆడుతూ పాడుతూ విద్యను అభ్యసించాలని తరగతి గది గోడలపై గీయించిన చిత్రాలను, సీఎస్ఆర్ నిధులతో అందించిన మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ సూర్యాపేట రీజనల్ మేనేజర్ కృష్ణమోహన్ అన్నారు. వెంపటి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రానికి గురువారం లక్ష పదివేల రూపాయల విలువ కలిగిన మాంటిస్సోరి లెర్నింగ్ మెటీరియల్, ఎల్ఈడీ, టీవీ, బుక్ స్టాండ్స్ అందించి మాట్లాడారు. అనంతరం పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందించిన ఈ మెటీరియల్‌ను పిల్లలకు ఉపయోగపడేలా చూడాల అంగన్వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటరామనర్సమ్మ, అంగన్వాడీ సూపర్‌వైజర్ ప్రమీల, సర్పంచ్ అబ్బగాని పద్మ సత్యనారాయణ, ఎస్‌బీఐ సూర్యాపేట రీజనల్ సెక్రటరీ మహేష్, ఎస్‌బీఐ తుంగతుర్తి మేనేజర్ నాగరాజు, ఉపసర్పంచ్ వెంకన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవీందర్, ఆంజనేయులు, అంగన్వాడీ టీచర్లు వసంత, స్వరూప, ఉమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ సూర్యాపేట రీజనల్ మేనేజర్ కృష్ణమోహన్

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో మండల కేంద్రానికి చెందిన గంధం రాము-నాగమణి దంపతులు వివాహ వార్షికోత్సవంతో పాటు వారి కుమారుడు సుతిక్ష జన్మదినం సందర్భంగా గురువారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు.



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి

నూతనకల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రొబేషనరీ సమయం ముగిసిన వెంటనే కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయల్సి ఉందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం వారు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చర్చలకు పిలవకపోగా బెదిరింపులకు పాల్పడుతుందని అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దెల రామ్మూర్తి, యానాల వెంకట్‌రెడ్డి, రవి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



దోసపహాడ్‌లో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గౌడ కులస్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర-సురాంభదేవి దేవాలయ నిర్మాణానికి గౌడ కులస్తులు గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు గౌడ్ పూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వర-సురాంభదేవి, వన ఎల్లమ్మ, వన మైసమ్మ దేవాలయాల నిర్మాణానికి గ్రామ గౌడలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన సద్దల సుశీల-యాదగిరిగౌడ్ 3గుంటల స్థలం విరాళంగా ఇవ్వడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు పందిరి సైదులు, కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాడిశెట్టి సైదులు, అబ్బగాని కాశయ్య, జాన్‌పాషా, కారింగుల సతీష్, పందిరి నాగయ్య, శెనగాని లక్ష్మయ్య, తండు చంద్రు, రమణయ్య, భిక్షం పాల్గొన్నారు.